# ఉద్యోగం

కథ

నూర్యరశ్మికి నల్లగా, తళతళా మెరుస్తోంది రోడ్డు. నిరాశా నిస్పృహలతో, ఎడతెగని ఆలోచనలతో ఆ రోడ్డు మీద నడుస్తున్నాను. నా నడకకు గమ్యం లేదు. నిర్దుష్టమైన దారీ అంతకన్నా లేదు. కాకపోతే దారిలో రోజూ ఒకచోట ఆగుతాను. అదే! అదే సెలూన్. సెలూన్ దగ్గరకు రాగానే ఎప్పటిలాగానే ఒసారి బోర్డు వంక చూసి మెల్లగా లోపలకు వెళ్ళాను. బెంచీ ఖాళీగా ఉంది. షేవింగ్, కటింగ్ చేయడంలో బిజీగా ఉన్నారు షాపు కుర్రాళ్ళు. నాకు చాలా సంతోషమయింది. అక్కడ నాక్కావాల్సిన వస్తువు 'దిన పత్రిక' బెంచీ మీద ఎవరి చేతుల్లోనూ లేకుండా ఖాళీగా నా కోసమే ఎదురు చూస్తున్నట్టుగా పడుంది అక్కడ. మొదటి పేజీలో వార్తలు నాకు అనవసరం. నాక్కావాల్సినవి రెండో పేజీలో ఎక్కువగా ఉంటాయి. వాటి కోసం ప్రయత్నించడమే కానీ నాకు అవి ఎండమావుల్లా దొరక్కుండానే పోతున్నాయి. వారడిగిన అర్హతలన్నీ నాకు ఉన్నట్లే అనిపిస్తుంది ఆ ప్రకటనలు చదివినంతసేపూ. ఉద్యోగం వచ్చినట్లే ఫీలవుతాను. కానీ రాదు. అయినా ప్రయత్నం మానుకోలేదు.

ఇంతలో ఒకతను లోపలికొచ్చి నా పక్కనే కూర్చున్నాడు. పెరిగిన గెడ్డాన్ని చేత్తో నిమురుతూ, ఎంత పెరిగిందో అంచనా వేస్తూ అద్దంలో చూసుకుంటున్నాడు. ఒక కుర్చీ ఖాళీ అయింది. "రండి!" అంటూ అతన్ని ఆహ్వానించాడు షాపతను. అతను జంకుతూ నా వైపు చూసి, "సార్ నా కన్నా ముందు ..." అంటూ నసిగాడు. షాపతను నవ్వి "సార్ రోజూ వస్తాడులెండి. కానీ ఎప్పుడూ షేవింగ్ చేయించుకోడిక్కడ. అతనొచ్చేది పేపర్ చదవడం కోసం" అని అనగానే నా ముఖం సిగ్గుతో ఎర్రబడింది.

నేనంటే అందరికీ చులకనే!

షాపులోంచి బయటికి నడిచాను. మళ్ళీ నల్లగా, పొడుగ్గా అంతులేని రోడ్డు. జేబులో బస్సు పాస్ కూడా ఉంది. కాని బస్సులో త్వరగా ఇల్లు చేరుకుని నేనేం చేయాలి? రోజంతా గోళ్ళు గిల్లుకుంటూ నా దురదృష్టానికి నేను కుమిలిపోతూ, ఇతరుల్ని కూడా బాధపెట్టడం దేనికి? నేను ఊరికే కూర్చుని మేయడం మా వదినగారికి నచ్చదు కాబోలు - ఏదో మిష మీద చంటివాణ్ణి చావబాదుతూ నానా మాటలూ అంటుంది. ఆ మాటలనేది వాణ్ణి కాదు, నన్నేనని నాకు బాగా తెలును.

పోనీ, ఏవో కథలు, నవలలు చదువుతూ కాలక్షేపం చేద్దామన్నా ఊహా ప్రపంచంలో విహరించడం నాకిష్టం లేదు. చదవక ముందే అవన్నీ కల్పితాలు అని అనిపిస్తాయి నాకు. ఒక వ్యక్తి మంచి పనులే చేస్తూ మొదట కష్టాలు పడినా చివరికి అతనికి గుర్తింపు, మంచి రోజులూ వస్తాయి. మరి వాస్తవంలో? - అలా ఆలోచిస్తూ నడుస్తుంటే ఇంతలో ఇల్లొచ్చింది. మధ్యాహ్నం ఒంటిగంట అయింది. కడుపులో ఆకలి మంట!

మా అమ్మ "అన్నం!" అంటూ నన్ను సంబోధించింది. "నాకిప్పుడే ఆకలిగా లేదు" అని అబద్ధమాడాను. నేనాడింది అబద్ధమని ఇరవై ఆరేళ్ళ నుంచి నన్ను చూస్తున్న అమ్మకు చాలా సులభంగా తెలుసు.

మౌనంగా వెళ్ళి భోజనం వడ్డించి, "రా!" అంది.

వెళ్ళి కూర్చున్నాను. అయిదు నిముషాల్లో ప్లేటు ఖాళీ అయింది. మారు అడగటానికి నాకెంత సిగ్గని! ఏ పనీ పాటా లేకుండా సుష్టుగా భోజనం చేసి మా అన్నయ్యకు, వదినకూ భారంగా తోచడం నాకెంతమాత్రం ఇష్టం లేదు. నా మీద ఎంత ప్రేమ ఉన్నా అమ్మ కూడా ఏమీ అనదు. చాలీ చాలని పెన్షన్ డబ్బుతో తనే భారంగా ఉంటున్నానన్న భావం అమ్మది.


భోజనం అయిపోయిందనిపించి మళ్ళీ రోడ్డెక్కాను. ఎటు వెళ్తున్నానో, ఎందుకు వెళ్తున్నానో స్పష్టంగా నాకే తెలియదు. రోడ్ల మీద నడుస్తూ కాలం వెళ్ళబుచ్చడం నాకొక వ్యసనంగా తయారయింది. గేటు మీద రంగు రంగుల సినిమా పోస్టర్లు! నా కన్నా ఎంతో తక్కువ చదువుకున్న హీరోలు చక్కని దుస్తులు ధరించి అందమైన ఆడవాళ్ళని కౌగిట్లో బంధించి డ్యాన్సు చేస్తున్న భంగిమలు.

అయ్యో! ఎలా ఆలోచిస్తున్నానో చూడండి! చదువుకూ, నటనకూ ఏమిటీ సంబంధం? పోస్టరు కింద ఏదో దర్శకుడి పేరు, దాని చివర బి.ఎ. అన్న రెండక్షరాలు గర్వంగా రాయించుకున్నాడు. రోడ్డుకిరువైపులా ఉన్న బోర్డులను చదువుతూ నడుస్తున్నాను. కష్టాలను కాసేపైనా మరుద్దామని. మందుల దుకాణాలు, కిరాణా కొట్లు, బట్టల షాపులు!


సాయంత్రం నాలుగయింది. స్కూళ్ళు వదిలారు. పుట్టల్లోంచి చీమలు వచ్చినట్లు బిలబిలమంటూ బయటికి వస్తున్నారు పిల్లలు. వారిని ఆప్యాయంగఆ దరికి చేర్చుకుని ఆటోల్లో, రిక్షాల్లో స్కూటర్ల మీద తీసుకు వెళ్తున్నారు వాళ్ళతల్లిదండ్రులు.

ఎందుకో అనవసరపు శ్రమ! దండగ ఖర్చు! గాలిమేడలు! శ్రద్ధగా చదువుకుని మంచి మార్కులు సంపాదించి నాలాగా రోడ్ల మీద పడాల్సిందే కదా! నన్నిలా వదిలేస్తే నాలో బయలుదేరుతున్న నిరాశా మేఘాలు నన్నే కాకుండా ప్రజల్నందరినీ కమ్మేస్తున్నాయి. నాబ ఆలోచనలు వాతావరణాన్నంతా కలుషితం చేస్తాయోమనన్న భయం కూడా ఉంది. నాకు.

కాళ్ళు చటుక్కున ఆగిపోయాయి. కిందికి వంగి చూశాను. ఎడంకాలి చెప్పు




– బి. రఘురామరాజు



## పుస్తకం

"ఏమండీ... నాలుగేళ్ళ నుంచీ మనింటికి చుట్టాలెవరూ రావడం లేదు. నాకు చాలా అవమానంగా ఉందండీ!" దిగులుగా అంది భార్య.

'వంకాయతో వంద రకాలు' పుస్తకం రాయొద్దంటే వినిపించుకున్నావు కాదు మరి! కోపంగా చెప్పాడు భర్త.

గొంటు శ్రీనివాస్

ఉంగరం తెగిపోయింది. ఎడం కాలు అలాగే భూమ్మీద ఈడుస్తూ, కుడి కాలుతో నడక సాగిస్తున్నాను. రోడ్డు వారగా, ఒక చెట్టు కింద చెప్పులు కుట్టే వాడు కూర్చుని ఉంటే, నా చెప్పును వాడి ముందుకు తోసాను బాగు చేయమన్నట్టుగా. చెప్పును చేతుల్లోకి తీసుకొని అటూ ఇటూ తిప్పి అర్థంకాక నావైపు చూశాడు. 'ఏంచేయమంటారు' అన్నట్లుగా. చెప్పాను.

'నోట్లోని కిళ్ళీని ఓసారి ఖాండ్రించి ఉమ్మి, "పెంటకుప్ప మీద పారేయాల్సిన చెప్పుల్ని ఏం రిపేరు చేయమంటారు సార్" అన్నాడు. సార్! అని ఏదో గౌరవం కోసం వాడాడు కాని నా పట్ల వాడికేమాత్రం గౌరవం లేదనే తెలుస్తోంది వాడి మాటలు వింటుంటే. వాడు నన్నలా అంటున్నప్పుడు, నా పక్కన మరెవ్వరూ లేనందుకు నేనెంతో సంతోషించాను. కాస్సేపటికి ఏదో నన్ను దయతలచినట్టు, ఉంగటాన్ని దాని పరిసర ప్రాంతాన్ని బాగుచేసి నా ముందుకు విసిరాడు. చెప్పులో కాలుదూర్చి, జేబులో చేయి పెట్టాను. చిల్లర డబ్బులు తాకాయి. రూపాయికన్నా ఎక్కువుండక పోవచ్చు. తీసి వాడికిచ్చాను. భయం భయంగా, ఈ దరిద్రుడు నాకిచ్చే దేమిటి? నేను పుచ్చుకునే దేమిటి?' అనుకున్నాడో ఏమో, నేనిచ్చిన పైసల్ని లెక్కయినా పెట్టకుండా, కూర్చున్న గోనెనంచి మడతల్లోకి విసిరేశాడు నిర్లక్ష్యంగా. అంతకన్నా వాడు నాలుగు మాటలు తిట్టినా బావుండునని పించింది.

నేను మళ్ళీ రోడ్డెక్కాను, తిన్నగా పొడుగ్గా, గమ్యం లేని రోడ్డు నల్లగా మెరుస్తోంది సాయంకాలపు నీరెండలో! ఓ కిలోమీటరు నడిచాక రైల్వేస్టేషన్ వచ్చింది. ప్లాట్‌ఫాం టిక్కెట్టు కొనకుండానే స్టేషన్‌లోకి వెళ్ళాను. రైల్వేస్టేషన్లు, బస్టాండులు అంటే నాకెంతో ఇష్టం. చిన్న పిల్లలతో బరుపైన సామాన్లలో నానా అవస్థపడుతూ, సీట్లకోసం తంటాలు పడే ప్రయాణీకులను చూస్తే నాకోరకంగా సంతోషం కలుగుతుంది. నాలాగా ఎంతో మంది ఈ ప్రపంచంలో బాధలు పడుతున్న వాళ్ళు ఉన్నారని! అది ఓ విధంగా 'శాడిజం' కాదా?

స్టేషనులో చాలా కోలాహలంగా ఉంది. సామాన్లు మోయలేని కోపంతో పిల్లల్ని కసురుకునే పెద్దలు! ఏడుస్తున్న పిల్లలు! అటు జీవితంలోనూ, ఇటు ప్రయాణంలోనూ అలసిపోయిన వృద్ధులు! రైలు దిగి, సామాన్లు మోయడానికి పోర్టరు కోసం వెదుకుతున్న ముసలతనొకరు నా కంట పడ్డాడు. సాయం చేద్దామని దగ్గరగా వెళ్ళాను. అతని రెండు సూట్‌కేసులను తీసుకొని అతడి ముందుగా నడుస్తూ ఆటోస్టాండ్ దగ్గరకు వెళ్ళాను. ఆటోలో కూర్చుంటూ వో ఐదురూపాయల కాగితం అందించబోయాడు. నేను పోర్టర్ని కాను. సాయం చేద్దామని వచ్చానంతే!" అన్న నన్ను చూసి ముఖం చిన్నబుచ్చుకుని, "సారీ! ఆ ఉద్దేశంతో ఇవ్వలేదు" అని ఐదునోటుని జేబులో ఉంచుకొని, కదలుతున్న ఆటోలోంచి చేయి ఊపాడు ఆప్యాయంగా!

మధ్యాహ్నం నుంచి ఎంత దూరం నడిచానో, నీరసంగా అనిపించింది. వేడివేడి కాఫీ తాగాలని మనసు ఆరాటపడుతోంది. జేబు తడిమితే, చిల్లిగవ్వ కూడా లేదు. ఆ ముసలతను ఇవ్వబోయిన ఐదు రూపాయల్ని కాదన్నందుకు బాధ కలిగింది. నేనెంత దౌర్భాగ్యుణ్ణి! ఆ అయిదు రూపాయలు నా శ్రమకు తగ్గ ఫలమే అయినా, దాని అవసరం నాకెంతో ఉన్నా దాన్ని స్వీకరించే మానసిక స్థితి నాకు లేదు! అంత ఆత్మవంచన! మనస్సు కావాలని ఆరాటపడుతున్నా పైకి ఒప్పుకోని ఫాల్స్ ప్రిస్టేజ్!

నా ముందు ఓ యువ జంట నడుస్తోంది! కొత్తగా పెళ్ళయిందో ఏమో ఒకరికొకరు తాకుతూ చిలిపిగా నవ్వుతూ, చుట్టూ ఉన్న జన సమూహాన్ని లెక్క చేయకుండా నడుస్తున్నారు. నాక్కూడా యవ్వనం వచ్చి దాదాపు పదేళ్ళు అవుతోంది. ఎవరో గుర్తు చేస్తే తప్ప నేనొక యువకుణ్ణి అన్న సంగతే జ్ఞప్తికి రాదు. ప్రేమలు, పెళ్ళిళ్ళు, వివాహాలు, ప్రణయ కలహాలు నాకు పుస్తకాల్లో, సినిమాల్లో తప్ప జీవితంలో కనిపించలేదు. బ్రతుకు తెరవే కష్టమయినవాడికి రంభ కావాలా? ఊర్వశితో సరిపెట్టుకుంటావా? అంటే ఎలా ఉంటుందో చెప్పండి మీరే! నాకు తెలియకుండానే యవ్వనం వచ్చింది. అలాగే నాకు తెలియకుండానే అది నిష్క్రమించినా నేనాశ్చర్యపోను! ఏదో ఆలోచనా పరంపర!

అలా ఆలోచిస్తూ నడుస్తున్న నన్నెవరో పిలిచినట్లయితే వెనక్కి తిరిగి చూశాను. సినిమా హాలు పక్కన, తోపుడు బండిలో బజ్జీలు తయారు చేసి అమ్ముకునే వ్యక్తి తప్ప ఎవరూ లేరక్కడ! ఎవరినో అయ్యుంటుందిలెమ్మని మళ్ళీ ముందుకు నడవసాగాను.

"శేఖర్!" అని మరీ బిగ్గరగా వచ్చిందీ సారి పిలుపు, తిరిగి చూద్దును కదా బజ్జీలు అమ్ముకునే వ్యక్తి నా వంక చూసి నవ్వుతూ పిలుస్తున్నాడు. అలాంటి వాడిచేత అంత చనువుగా పిలిపించుకోవడం చిన్నతనంగా ఫీలయ్యాను.

అయినా వాడెవ్వడో, నన్నెందుకలా పిలుస్తున్నాడో వెంటనే అర్థం కాలేదు. దగ్గరకు వెళ్ళాక తెలిసింది, వాడు నా క్లాస్‌మేట్, ఉమాధర్!

"ఈ పదకొండవ అవతారమేమిట్రా? ఇక్కడ, ఇలా! ఆశ్చర్యంగా అడిగాను.

"ఏం బాగాలేదా?" అంటున్నప్పుడు ఆ పని చేస్తున్నందుకు బాధపడుతున్నట్లు వాడి ముఖాన ఫీలింగ్ ఎక్కడా లేదు!

"మీ నాన్నా, తాతగార్లు బాగా బతికినవాళ్ళు కదరా! నువ్విలాంటి పని....." మధ్యలో ఆపాను ఆ తర్వాత ఏమనాలో తోచక.

"నేనేం తప్పు పని చేస్తున్నానని! నిజం చెప్పాలంటే నేనే వాళ్ళకంటే బాగా బ్రతుకుతున్నానురా! అదంతా తీరిగ్గా మాట్లాడుకుందాం కాని నీ సంగతి చెప్పు! ఏం చేస్తున్నావ్! పిల్లలెందరు?" అడిగాడు వాడు ఆసక్తిగా.

నా గోడంతా వెళ్ళబోసుకున్నాను, పెద్దగా నిట్టూరుస్తూ. "ఈ దేశంలో మేధావులకు గుర్తింపులేదనీ, విద్యకు గౌరవం లేదనీ, ఇక్కడ పుట్టడం నాలాంటి వాళ్ళ దౌర్భాగ్యమనీ" ఏదేదో అనేశాను ఆవేశంగా.

వాడేమీ అనకుండా, 'నువ్వెంత తెలివి లేని వాడివిరా' అన్నట్టు నా వంక చూసి అదోలా నవ్వాడు.

"శరీరంలో మెదడెంత ముఖ్యమైన భాగమయినా, అది ఆలోచించగలదే తప్ప చేతులు కాళ్ళు చేసే పనులు అది చేయలేదు అన్న వాస్తవాన్ని తెలుసుకున్నవాడే నిజమైన మేధావి! కొంచెం చదువుకున్న ప్రతి భారతీయుడూ 'అదే అమెరికాలో అయితేనా' అని మాటిమాటికి పోలిక తెస్తుంటాడు కాని అమెరికన్లు బాగా చదువుకున్నారు కదా అని సొంత పనులు చిన్న చిన్నవి చేసుకోవడానికి సిగ్గుపడరు. ఒకసారి రాజకీయాల్లోకి వస్తే, చచ్చేదాకా పదవుల్ని పట్టుకుని ప్రాకులాడరు. రెండు సినిమాలు హీరోగా హిట్టయితే, జనం ఛీకొట్టేదాకా నటిస్తూ జనాన్ని చంపరు. కాబట్టి మనదేశంలో పుట్టినందుకు బాధపడాల్సినంత అవసరం లేదు. కొంచెం ప్రయత్నిస్తే, భేషజాలకు పోకుంటే, ఇక్కడా ఉన్నాయి బ్రతుకు తెరవు చూపించే ఉద్యోగాలెన్నో!" అన్నాడు వాడు ఆప్యాయంగా నా భుజం తడుతూ-

ఇంతలో ఓ ఆటో వచ్చి ఆగడం, అందులోంచి ఒంటినిండా బంగారు నగలున్న అందమైన యువతి చంకలో పిల్లాడితో దిగి ఉమాధర్‌తో ఏదో మాట్లాడి వెళ్ళడం జరిగాయి.

"పెద్దపెద్ద వాళ్ళు కూడా నీ బజ్జీలు తింటుంటారట్రా?" అన్నాను వేళాకోళంగా.

"తినరు. ఇంటి దగ్గర చేసి తినిపించుతారు కొసరి, కొసరి!" అన్నాడు వాడు.

నా కర్థం కాలేదు.

ఇందాక వచ్చింది చూడు!? ఆమే మీ వదిన. అంటే మా ఆవిడ!" అన్నాడు.

ఆశ్చర్యపోయాను.

నాతో పూసగుచ్చినట్లు వాడి కథంతా చెప్పాడు.

"రెకమెండేషన్ చేసే నాథుడు దొరక్క, క్లర్కు ఉద్యోగానికి లంచంగా ఇవ్వడానికి పది, పదిహేను వేలు అందక చివరగా ఒక కిలో పిండి, ఒక కిలో నూనె, యాభై పచ్చి మిరపకాయలతో ప్రారంభించాను ఈ వ్యాపారం! ఇప్పుడు స్కూటర్, కలర్ టీవీ, నాలుగు గదులు ఇల్లు అన్నీ వున్నాయ్. దగ్గర్లోని సెంటర్లో హోటల్ కూడా ప్రారంభించబోతున్నాను వచ్చే నెలలో!" అంటున్నప్పుడు వాడి కళ్ళల్లో ఆత్మవిశ్వాసం, పట్టుదల తళుక్కున మెరిశాయి.

• • •

వాడి కథంతా విన్న తర్వాత నాలో ఆలోచన చెలరేగింది పెను తుఫానులా. "రోడ్డు పక్కన చెప్పులు కుట్టేవాడూ, షాపులో జుత్తు కత్తిరించేవాడూ, సెంటర్లో బజ్జీలు అమ్మేవాడూ- వీళ్ళంతా చేసేవి ఉద్యోగాలు కాదా? భార్యా పిల్లల్ని వాళ్ళు పోషించడం లేదా? వారికి లేనిదీ, నాకున్నదీ ఏమిటి? పేరు చివరన తగిలించుకున్న 'ఎం.ఏ' అన్న ఆ రెండక్షరాలు తప్ప, నాకేం ప్రత్యేకత ఉంది!" ఆలోచిస్తున్న కొద్దీ, నేనిన్నాళ్ళు కాలం ఎంత వృథా చేశానో అర్థమైంది.

నా భ్రమలు తొలిగాయి.

వాడితో సెలవు తీసుకొని ఇంటిముఖం పట్టాను.

ఇన్నాళ్ళు నల్లగా, పొడుగ్గా, అంతులేనట్లు కనిపించిన రోడ్డు, ఇప్పుడు గమ్యం ఉన్నదానిలా కన్పించసాగింది. ఏదైనా సరే, కష్టపడి పనిచేసి సంపాదించిన డబ్బుతోనే నేను రేపటి భోజనం చేయాలన్న పట్టుదలతో, రోడ్డు మీద వడివడిగా నడుస్తున్నాను ఎంతో ఉత్సాహంగా. ●